క్లుప్తంగా

వలంటీర్లకు సన్మానం



వలంటీర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీలోని ఐదు గ్రామ సచివాలయాల పరిధిలో వివిధ అవార్డులకు ఎంపికైన వలంటీర్లకు సోమవారం సన్మానించారు. పట్టణంలో 140 మంది వలంటీర్లు ఉండగా ఇద్దరు సేవారత్న, మిగిలిన వలంటీర్లు సేవామిత్ర అవార్డులకు ఎంపికయ్యారు. ఈ మేరకు మేజర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో వారిని ఘనంగా సత్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు చేర్చడంలో వలంటీర్లు ప్రధాన పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ఈఓ బాలాంజనేయులు, నాయకులు చిక్కేపల్లి ప్రసాదరెడ్డి, గడ్డం వరప్రసాదరెడ్డి, దశరథరామిరెడ్డి, గజ్జెలరెడ్డి, సుబ్బయ్య పాల్గొన్నారు.

కోవెలకుంట్లలో మోస్తరు వర్షం



కోవెలకుంట్లలో వర్షం కురుస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లోని పలు మండలాల్లో సోమవారం మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ అధికంగా ఉండి సాయంత్రానికి వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటు చేసుకుని ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. ఎండతీవ్రతతో అల్లాడుతున్న ప్రజానీకం వర్షం కురవడంతో ఉపశమనం పొందారు. మరో రెండు రోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుండటంతో సీజన్‌కు ముందే వర్షాలు ప్రారంభం కావడంతో రైతులు ఊరట చెందుతున్నారు.

వాహనాల వేలం

కొలిమిగుండ్ల: స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో సోమవారం తహసీల్దార్ దోనీ ఆల్‌ఫ్రెడ్ సమక్షంలో వాహనాల వేలం నిర్వహించినట్లు ఎస్‌ఐ రమేష్‌రెడ్డి తెలిపారు. వివిధ రకాల కంపెనీలకు చెందిన ఆరు మోటార్ సైకిళ్లకు నంద్యాల ఆర్టీఓ నిర్ణయించిన ధరల మేరకు వేలం నిర్వహించారు. ఆరు బైక్‌లను వివిధ గ్రామాలకు చెందిన వ్యక్తులు రూ.44,500కు కొనుగోలు చేశారని ఎస్‌ఐ చెప్పారు. జీఎస్టీ కింద రూ.8,010 వసూలు చేయడంతో మొత్తం రూ.52,510 వేలం పాటలో సమకూరిందని పేర్కొన్నారు.

శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

బేతంచెర్ల: స్థానిక శేషారెడ్డి ఉన్నత పాఠశాల్లో కొనసాగుతున్న 60 రోజుల ఉచిత డ్రోన్ పైలెట్ శిక్షణకు 18 – 32 సంవత్సరాలలోపు నిరుద్యోగ యువతీ, యువకులు దరఖాస్తు చేసుకోవాలని ట్రైనింగ్ ఇన్‌స్ట్రక్టర్లు దస్తగిరి సోమవారం తెలిపారు. వివరాలకు పాఠశాలలో సంప్రదించాలని కోరారు.

ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు

డోన్ టౌన్: స్థానిక బుగ్గన శేషారెడ్డి మెమోరియల్ ఇండోర్ స్టేడియంలో శుభం విల్లాస్ అండ్ డెవలపర్స్ అధ్వర్యంలో నిర్వహిస్తున్న పురుషుల డబుల్స్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ముగిశాయి. విజేతలకు సోమవారం బహుమతులను కమలాపురం సర్పంచ్ అర్జున్‌రెడ్డి ప్రధానం చేశారు. ప్రతి కేటగిరి విన్నర్స్‌కు రూ.25వేలు,రన్నర్స్‌కు రూ.12,500, మూడవ,నాల్గవ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.7,500 నగదు, ట్రోఫీలు అందజేశారు.

గ్రామాలను తీర్చిదిద్దుతాం

బేతంచెర్ల: మండలంలోని గ్రామాలను మంత్రి బుగ్గన చొరవతో ఆదర్శంగా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి తెలిపారు. సోమవారం తవిసికొండ గ్రామంలో పొలాల రహదారులు ఇబ్బందికరంగా ఉన్నాయని రైతులు పేర్కొనడంతో పంచాయతీ రాజ్ ఇంజినీర్ గణేష్, సర్పంచ్ లక్ష్మీదేవి, రైతులతో కలిసి పరిశీలించారు. పాయలపెంట రస్తా 300 మీటర్లు, పంపుల రస్తా 350 మీటర్లు రహదారి మంజూరుకు ప్రతిపాదనలు తయారు చేసినట్లు ఏఈ గణేష్ తెలిపారు. నాయకులు బండి కాటి వెంకటేశ్వర్ రెడ్డి, తిరుమలేశ్వర్ రెడ్డి ,నాగేశ్వరరావు,ఎద్దులన్న, రామనాయుడు, గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వృద్ధులకు కంటి పరీక్షలు

కోవెలకుంట్ల: 'వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా వృద్ధులకు ఉచితంగా కంటి అద్దాలు, ఆపరేషన్లు చేస్తున్నట్లు డాక్టర్ విద్యాసాగర్ తెలిపారు. సోమవారం మండలంలోని రేవనూరు పీహెచ్‌సీ పరిధిలోని గుండుపాపల గ్రామంలో 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించారు.

రుతుక్రమంపై అవగాహన

డోన్ టౌన్: మహిళల జీవితాల్లో రుతుక్రమం సర్వ సాధారణమని మెప్మా సభ్యులు పేర్కొన్నారు. సోమవారం కౌమార బాలికలు, మహిళలకు రుతుక్రమంపై ఉండే అపోహలను తొలగించేందుకు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఆ సమయంలో శరీరంలో సంభవించే మార్పులపై అవగాహన కల్పిస్తూ తీసుకోవలసిన జాగ్రత్తలపై సలహాలు ఇచ్చారు.

☛ ఇక్కడ చీరల దుకాణం నిర్వహిస్తున్న మహిళ పేరు వై.హసీనా. బనగానపల్లెకు ఈమె నాలుగేళ్ల క్రితం వరకు కుటుంబ పోషణకు ఇబ్బందులు పడేవారు. నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ఏటా అందుతున్న వైఎస్సార్ చేయూత, ఆసరా పథకాల సొమ్ముతో చీరల వ్యాపారం ప్రారంభించింది. ప్రస్తుతం వ్యాపారం పుంజుకోవడంతో జీవనోపాధికి ఇబ్బందులు లేవని చెబుతోంది.



☛ కిరాణా దుకాణం నిర్వహిస్తున్న ఈమె పేరు కందుకూరు పద్మావతి, భవాని గ్రూపు బనగానపల్లెలో సభ్యురాలు. వైఎస్సార్ చేయూత, ఆసరా పథకాల సొమ్ముతో నూతనంగా కిరాణా దుకాణం ఏర్పాటు చేసుకున్నానని, ప్రస్తుతం వ్యాపారం బాగా జరుగుతుండటంతో కుటుంబ పోషణకు ఇబ్బందులు తప్పాయని పేర్కొంది.



అభివృద్ధి పరుగులు

- నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో జోరుగా అభివృద్ధి పనులు
- మరో పక్క పేదల అభ్యున్నతికి సంక్షేమ పథకాల అమలు
- జగనన్న పాలనలో సంతోషంగా ప్రజలు



రూ.738 కోట్లతో జీఎన్ఎస్ కాల్వ లైనింగ్ పనులు పూర్తి

బనగానపల్లె: నియోజకవర్గం అభివృద్ధి పథంలో పరుగులు తీస్తోంది. వైఎస్సార్‌సీపీ నాలుగేళ్ల పాలనలో పేదల మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిచ్చింది. మొత్తం రూ.2,549 కోట్లు మంజూరు చేయగా సంక్షేమ పథకాలతో 4.32 లక్షల మందికి చేకూరిన లబ్ధి రూ.994 కోట్లు. ప్రతి ఇంటికి సుమారు 3,4 సంక్షేమ పథకాలు తక్కువ కాకుండా లభించాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నియోజకవర్గంలో సంక్షేమంతో పాటు అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇస్తోంది. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్న సీఎం వైఎస్ జగన్ నవరత్నాలు పథకాలతో అర్హులకు పారదర్శకంగా పథకాలు అందజేయడానికి సచివాయల, వలంటీర్ వ్యవస్థలను తీసుకొచ్చి ప్రజల వద్దకే పాలన సాగిస్తున్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి చొరవతో సమస్యలు పరిష్కారమవుతున్నాయి.

నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి..

☛ బనగానపల్లెలో రూ.22 కోట్లతో చెప్పటిన వంద పడకల ఏరియా ఆసుపత్రి నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. జిల్లా ఆసుపత్రిగా తీర్చిదిద్దుతున్నట్లు వైద్యాధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికే వైద్య సిబ్బంది నియామకం జరగడంతో పూర్తిస్థాయిలో వైద్య సేవలందుతున్నాయి.

☛ బనగానపల్లెలో షాదీఖానా నిర్మాణానికి రూ.1.30 కోట్ల నిధులు మంజూరయ్యాయి.

☛ మాసుంబాషా దర్గా శ్మశాన వాటిక ప్రహరీ నిర్మాణానికి రూ.69 లక్షలు మంజూరు కాగా నిర్మాణ పనులు చురుగ్గాసాగుతున్నాయి.

☛ తపాలా శాఖ కార్యాలయం పక్కన శ్మశాన వాటిక ప్రహరీ నిర్మాణంతో పాటు మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టారు.

☛ పట్టణంలో అవుకు మెట్ట సమీపంలో ఇబాదత్‌ఖానాకు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి రూ.35 లక్షలతో పనులు చేపట్టారు.

☛ ఆర్యవైశ్య బ్రాహ్మణ సంఘం శ్మశానవాటికకు రూ.10 లక్షలు కేటాయించి పనులు చేపట్టారు.

☛ బనగానపల్లె ,కోవెలకుంట్ల పట్టణాల్లో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి రూ.12 కోట్లతో ఫోర్ లేన్స్ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

☛ జీఎన్ఎస్ లైనింగ్,అవుకు టన్నెల్–3 నిర్మాణ పనుల కోసం రూ.1,250 కోట్లు మంజూరు కాగా లైనింగ్ పనులు 95 శాతం పూర్తయ్యాయి. టన్నెల్ నిర్మాణపనులుయుద్ధప్రతిపాదికన జరుగుతున్నాయి.

☛ నియోజకవర్గంలో మొత్తం 79 గ్రామ సచివాయాలను రూ.42లక్షలతో ఒక్కొక్కటి చొప్పున భవనాలను నిర్మించారు. వీటి ద్వారా ప్రజలకు నేరుగా సేవలందుతున్నాయి. మొత్తం 77 ఆర్‌బీకేల (ఒక్కొక్కటి రూ.21.80లక్షలు) ద్వారా ప్రతి రైతుకు గ్రామస్థాయిలో సబ్సిడీ విత్తనాలు, సాగులో మెళకువలు, ఎరువులు, సస్యరక్షణ సలహాలు, పంటదిగుబడుల కొనుగోలు సాగుతున్నాయి.మొత్తం 53 హెల్త్ క్లినిక్‌లు మంజూరుకాగా ఒక భవనం నిర్మాణానికి రూ.17.5లక్షల చొప్పున మంజూరయ్యాయి. వీటి ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందుతున్నాయి.

☛ నియోజకవర్గంలో 180 పాఠశాలలను రూపుదిద్దేందుకు నాడు–నేడు కింద రెండు విడతల్లో సుమారు రూ.40 కోట్లు విడుదలయ్యాయి.

☛ నియోజకవర్గంలోనున్న మహా సిమెంట్, అల్ట్రాటెక్, రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీల పరిధిలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 15వేల మందికి స్థానికులకు ఉపాధి లభిస్తుంది.



గ్రామ గ్రామన రైతుభరోసా కేంద్రాలు



మెరుగులు దిద్దుకుంటున్న వంద పడకల బనగానపల్లె ఏరియా ఆసుపత్రి

నియోజకవర్గంలో సంక్షేమ పథకాలు అమలు

పథకం పేరు	లబ్ధిపొందిన వారి సంఖ్య	లభించిన మొత్తం (రూ.కోట్లు)
వైఎస్సార్ పింఛన్ కానుక	68,576	282.81
ఈబీసీ నేస్తం	3069	6.69
జగనన్న విద్యా వసతి దీవెన	17,718	72.01
వైఎస్సార్ చేయూత	15,318	3985
జగనన్న అమ్మ ఒడి	45,728	6337
జగనన్నతోడు	3,905	7.01
ఇన్‌పుట్ సబ్సిడి	13,028	10.70
వైఎస్సార్ సున్నా వడ్డీ	71,698	2744
వైఎస్సార్ ఆసరా	42,415	1937
వైఎస్సార్ రైతుభరోసా	92,074	8288
శ్రీనిధి	7,315	3657
వైఎస్సార్ హౌసింగ్	9,086	163.60

అభివృద్ధే ధ్యేయంగా



ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా కృషి చేస్తున్నారు. అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించి వాటికి నిధులు మంజూరు చేయిస్తున్నారు. నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించేలా పర్యవేక్షిస్తున్నారు. రానున్న రోజుల్లో నియోజకవర్గం అన్ని రంగాల్లో ముందజలో ఉంటుంది.

– మానసవీణ, ఎంపీపీ బనగానపల్లె

వలంటీర్లు సంక్షేమ వారధులు



వలంటీర్లను సన్మానించిన ఎమ్మెల్యే కాటసాని, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల

బనగానపల్లెరూరల్: వలంటీర్లు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక పొదుపు భవనంలో వలంటీర్లకు వందన కార్యక్రమంలో భాగంగా సేవ రత్న,సేవామిత్ర,సేవా వజ్ర అవార్డులు పొందిన వలంటీర్లను సన్మాన కార్యక్రమం ఎంపీడీఓ శివరామయ్య అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలవడం గర్వకారణమన్నారు. జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి మాట్లాడుతూ వలంటీర్లు సేవాభావంతో పనిచేయాలని సూచించారు. ఎంపీపీ మానసవీణ,మండల ఉపాధ్యక్షురాలు ఎం లక్ష్మీదేవి వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షులు గుండం నాగేశ్వరరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండం శేషిరెడ్డి,మాజీ ఎంపీటీసీ అబ్దుల్‌ఫైజ్, పట్టణ సర్పంచ్ ఈసారి యల్లమ్మ, ఈఓ ఖాలీల్, తోట బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

అవుకు: పథకాలను పారదర్శకంగా అందిస్తున్న వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎంపీపీ చల్లా రాజశఖర్ రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో సర్పంచ్ మందా గుర్రమ్మతో కలిసి మండలంలోని 18 గ్రామ సచివాలయాల పరిధిలో ఉన్న వలంటీర్లను సత్కరించారు. అనంతరం సబ్సిడీపై జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు.

ప్యాపిలి: గ్రామ వలంటీర్లు సేవలు వెలకట్టలేనివని జెడ్పీటీసీ బోరెడ్డి శ్రీరామిరెడ్డి, ఉప సర్పంచ్ గడ్డం భువనేశ్వర్‌రెడ్డి అన్నారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో వలంటీర్లను సన్మానించారు. ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్ అధ్వర్యంలో కార్యక్రమం ఏర్పాటు చేశారు.

మృతదేహం లభ్యం



మిద్దెల మారయ్య (ఫైల్)

సంజామల: మండలంలోని పేరుసోముల గ్రామానికి చెందిన మిద్దెల తిరుపాలు, లక్ష్మీదేవి కుమారుడు మిద్దెల మారయ్య (24) గత ఏడాది జూన్ 17న అదృశ్యంపై కేసు నమోదైంది. సోమవారం గ్రామ సమీపంలో రాళ్ల గుట్టల్లో మృతదేహం బయటపడింది. విషయం తెలుసుకున్న కోవెలకుంట్ల సర్కిల్ సీఐ నారాయణరెడ్డి, సంజామల ఎస్‌ఐ ప్రతాప్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. మారయ్యకు చెందినవే అని తల్లిదండ్రులు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు.

వరిగడ్డి దగ్ధం



అవుకు: పట్టణ సమీపంలోని పొలాల్లో సోమవారం వరిగడ్డికి నిప్పంటుకోవటంతో పూర్తిగా దగ్ధమైపోయింది. బాధిత రైతు దాడిశెట్టి హరినాథ్ తెలిపిన వివరాల మేరకు.. శింగనపల్లె రస్తాలో తమకున్న 7ఎకరాలతో పాటు మరో మూడు ఎకరాలను కౌలుకు తీసుకొని వరి పంటను సాగు చేశారు. రెండు రోజుల క్రితం పంట కోతలు పూర్తవడంతో పొలంలో నుంచి దిగుబడిని తీసుకెళ్లారు. కోతల అనంతరం పొలంలో నిల్వ ఉన్న వరి గడ్డికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారని, దీంతో దాదాపు రూ.70వేల వరకు నష్టం వాటిల్లిందని వాపోయాడు.

మోడల్ నియోజకవర్గంగా డోన్

- సుమారు రూ.3వేల కోట్లతో అభివృద్ధి
- నాలుగేళ్లలో వైఎస్సార్‌సీపీ చేపట్టిన పనులతో నియోజకవర్గం కళకళ



యర్రగుంట్ల రోడ్‌లో నగరవనం ఏర్పాటు చేసిన దృశ్యం

డోన్: టీడీపీ హయాంలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి శూన్యం.దాదాపు రూ.3వేల కోట్లతో 50 ఏళ్లలో చేయాల్సిన అభివృద్ధిని నాలుగేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసి చూపింది. ఇప్పటికే పలు పనులు పూర్తి కాగా.. మరికొన్ని పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చొరవతో పారదర్శకంగా, నాణ్యమైన నిర్మాణాలు చేపట్టడంతో పట్టణంతో పాటు పల్లెలకు కొత్త శోభ వచ్చింది. పనులు వేగం పుంజుకోవడంతో రాష్ట్రంలోనే మోడల్ నియోజకవర్గంగా పేరొందింది.

అభివృద్ధి పనుల్లో కొన్ని..

☛ రూ.30 కోట్లతో 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని వంద పడకల స్థాయికి పెంచడం :

☛ రూ.40కోట్లతో నగర వనం ఏర్పాటు

☛ 7పార్కుల్లో పిల్లలు,వృద్ధులు ఉత్సాహంగా,ఉల్లాసంగా గడిపేందుకు సకల సౌకర్యాలు కల్పించడం

☛ ప్యాపిలిలో రూ.50కోట్లతో రైతుల కోసం ఇంటిగ్రేటెడ్ ఆధునిక మార్కెట్ టెర్మినల్ ఏర్పాటు

☛ రూ.20కోట్లతో పట్టణంలో డబుల్ రోడ్డు ఏర్పాటు

☛ రూ.46 కోట్లతో డోన్ రాయలచెర్వు రోడ్డు నిర్మాణం

☛ రూ.360 కోట్లతో 53 కి.మీ హైవే టు హైవే కనెక్టివిటీ రోడ్ల నిర్మాణం

☛ హంద్రీనీవా కాలువ నుంచి నియోజకవర్గంలోని అన్ని చెరువులను నీటితో నింపడం

☛ రూ.330 కోట్లతో గోరుకల్లు రిజ్వాయరు నుంచి వాటర్ గ్రిడ్ ద్వారా నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి మంచినీటి కుళాయిలను ఏర్పాటు చేయడం

☛ నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి కోట్లాది రుపాయల నిధులు వెచ్చించి రోడ్లు వేయడం

☛ ప్యాపలిలో వెటర్నరీ కళాశాల,గొర్రెల పెంపకంపై శిక్షణ కేంద్రం, బేతంచెర్లలో పాలిటెక్నిక్ కళాశాల, డోన్ ప్రభుత్వ ఐటీఐలో 300 మందికి సరిపడ వసతి గృహ నిర్మాణం

☛ రూ.8కోట్లతో అత్యాధునిక వసతులతో డోన్ కురగాయల మార్కెట్ నిర్మాణం



వెంకటాపురం తుమ్మల చెరువును హంద్రీనీవా ద్వార నీటిని నింపిన దృశ్యం



.రూ.3కోట్లతో నిర్మించిన ఆర్ అండ్ బీ అతిథి గృహం

☛ నియోజకవర్గంలో విద్యావంతులైన నిరుద్యోగుల కోసం ఐటీడీఆర్ డ్రైవింగ్ శిక్షణ కేంద్రం, కియా కార్ల కంపెనీ,ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రం ఏర్పాటు

☛ రూ.23.5కోట్లతో కోర్టు భవనాల సముదాయాల నిర్మాణం.

☛ రూ.3కోట్లతో ఆర్‌అండ్‌బీ అతిథిగృహం నిర్మాణం.

☛ పట్టణంలోని పేదలకు ఇళ్ల స్థలాలు

☛ మునుపెన్నడూ లేనంతగా పింఛన్ కానుక అమలు

☛ నాడు–నేడుతో పాఠశాలల అభివృద్ధి

నాడు అభివృద్ధి జరగలేదు



ఈ ప్రాంతం రైతులు కోరిన ఒకే ఒక్క కోరిక టమాటా జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటు చెయ్యలేక పోయారు టీడీపీ వాళ్లు. ఈ ప్రాంతం నుంచి సీఎంలు,డిప్యూటీ సీఎంలుగా పదవులు చేపట్టిన వారు ఎలాంటి అభివృద్ధి చేయలేదు. ముఖ్యంగా చంద్రబాబునాయుడు రాయలసీమ వాసి అయ్యుండి ఈ ప్రాంతాన్ని నిర్లక్ష్యానికి గురిచేశారు.

–రాజయ్యగౌడ్,డోన్

పారదర్శకంగా పాలన.. అర్హులకు పథకాలు

- సీఎం జగనన్న పాలనలో సంతోషంగా ప్రజలు
- పాదయాత్ర ఎందుకు చేస్తున్నారో లోకేష్‌కే తెలియాలి
- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల





బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లెరూరల్: పారదర్శకంగా పాలన.. అర్హులందరికీ పథకాలు అందజేస్తుండటంతో జగనన్న పాలనలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సోమవారం మండలంలోని టంగుటూరు గ్రామంలోని శ్రీ పెద్దమ్మ గుడి ఆలయం నుంచి బనగానపల్లె వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఎమ్మెల్యేతో పాటు జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎమ్మెల్యే కుమారుడు కాటసాని ఓబులరెడ్డి,ఎమ్మెల్యే సోదరుడు కాటసాని ప్రసాదరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన సంఘం అధ్యక్షుడు గుండం నాగేశ్వరరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండం శేషిరెడ్డి, ముస్లిం మైనార్టీ నాయకులు అత్తార్ జాహెద్,అబ్దుల్‌ఫైజ్,డాక్టర్ మహమ్మద్ హుస్సేన్, బండి బ్రహ్మానందరెడ్డి,ప్రతాప్‌రెడ్డితో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ర్యాలీ టంగుటూరు,అప్పలాపురం,కైప గ్రామాల మీదుగా బనగానపల్లె పట్టణంలోని జీఎం టాకీస్, పాతబస్టాండ్, పొట్టిశ్రీరాములు విగ్రహం మీదుగా అవుకుమెట్ట వరకు జరిగింది. అవుకుమెట్ట సర్కిల్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటీవల యువగళం పేరుతో నారా లోకేష్ పాదయాత్ర ఎందుకు చేస్తున్నారో ఆయనకే తెలియదన్నారు. గతంలో పాదయాత్రలు నిర్వహించిన వైఎస్సార్, జగనన్న ప్రజల సమస్యలను తెలుసుకోవడానికి ప్రాధాన్యతనివ్వడంతో వారు ప్రజల మనస్సు చూరగొన్నారన్నారు. ఇందుకు విరుద్ధంగా ఎమ్మెల్యేలను వ్యక్తిగతంగా విమర్శించడంపైనే దృష్టి సారించారన్నారు. నియోజకవర్గంలోని ప్రజలకు మంచి జరిగితే మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి ఓర్వలేరని మండిపడ్డారు. పట్టణంలో ఇళ్లు లేని సుమారు 3,500 మంది పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీకి చర్యలు తీసుకోగా ఆయన కోర్టు ద్వారా అడ్డుకున్న విషయం తెలిసిందేనన్నారు. కొలిమిగుండ్ల మండలంలో పేదలకు భూ పంపిణీ చర్యలు తీసుకోగా వాటిని కూడా కోర్టు ద్వారా అడ్డుకోవడం సిగ్గుచేటన్నారు. ఎన్ని అడ్డుకులు సృష్టించినా పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు.తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రవ్వలకొండ,ఎన్జీవో కాలనీల్లో ఒక్కొక్కటి 2.50 లక్షల సామర్థ్యం కలిగిన ఓహెచ్‌ఆర్ ట్యాంకుల నిర్మాణం త్వరలోనే పూర్తవుతుందన్నారు. అలాగే రూ.22 కోట్లతో చేపట్టిన వంద పడకల వైద్యశాల నిర్మాణం కూడా చివరి దశలో ఉందని చెప్పారు. పట్టణంలో సుమారు రూ.6 కోట్లతో టీటీడీ కలాణ మండపం, ముస్లింల కోసం రూ.1.30 కోట్లతో షాదీఖానా నిర్మాణానికి నిధులు మంజూరు చేశామన్నారు. ఇంకా పలు అభివృద్ధి పనులు చురుగ్గా కొనసాగుతున్నాయని వివరించారు.

ప్రజలను మోసం చేసేందుకు బాబు కొత్త ఎత్తుగడ..

గతంలో చంద్రబాబునాయుడు 650 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని గాలికి వదిలేశారని, ప్రస్తుతం మరోసారి మోసం చేసేందుకు కొత్త మేనిఫెస్టో అంటూ ప్రకటనలు చేస్తున్నారని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి విమర్శించారు. ఆ మేనిఫెస్టోను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. నాయకులు గోపవరం గోపాల్‌రెడ్డి, అబ్దుల్‌ఖైర్, అల్లెసురేష్‌రెడ్డి, శివరామిరెడ్డి, శంకర్‌రెడ్డి, నీలిశ్రీనివాసులు,యల్లయ్య,సురేష్, చెరువుపల్లె పుల్లయ్య, ఈశ్వర్‌నాయక్, జనార్ధన్‌రెడ్డి, మహానందిరెడ్డి, సురేష్‌రెడ్డి, హనుమతురెడ్డి, చిన్నమద్దిలేటి, కాటసాని రామకృష్ణారెడ్డి, శ్రీనివాసులు, అంబటి రవికుమార్ రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, కిశోర్, కంబగిరి, రోబో, నందివర్గం నారాయణ, జీటీ వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

8 కూనలకు జన్మనిచ్చిన శునకం

స్థానిక అయ్యప్పస్వామి దేవాలయ వీధిలో నివాసం ఉంటున్న అవుకు మండలం చెన్నంపల్లె గ్రామానికి చెందిన మారం భాస్కర్‌రెడ్డి పెంపుడు కుక్క సోమవారం ఎనిమిది కూనలకు జన్మనిచ్చింది. రెండేళ్ల క్రితం బనగానపల్లెలో ఉన్న తమ బంధువుల ఇంటి వద్ద నుంచి పామేరియన్ జాతి శునకాన్ని తెచ్చుకుని పెంచుకుంటున్నాడు. అరవై రోజుల క్రితం గర్భందాల్చిన కుక్క ఎనిమిది కుక్క పిల్లల్ని ఈనింది. కూనలన్నీ ఆరోగ్యంగా ఉన్నట్లు యజమాని తెలిపారు. ఈ విషయమై పశువైద్యాధికారి కృష్ణ కుమార్ మాట్లాడుతూ పామేరియన్ జాతి శునకాలకు సరైన ఆహార పదార్థాలతో పోషణ కలిస్తే ఆరు నుంచి ఎనిమిది కుక్కపిల్లలకు జన్మనిచ్చే అస్కారం ఉందన్నారు. గర్భం దాల్చిన సమయంలో పిండం విభజన చెంది ఇలా జరగవచ్చని వివరించారు.

– కోవెలకుంట్ల

